దర్శినికి స్వర్ణం

ఏషియన్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బ్యాంకాక్(థాయ్‌లాండ్) వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఏషియన్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన శ్రీదర్శిని పసిడి పతకంతో మెరిసింది. టీమ్ ర్యాంకింగ్ ఈవెంట్‌లో పోటీకి దిగిన దర్శిని అద్భుత ప్రదర్శన కనబరిచింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ఈ యువ చెస్ ప్లేయర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఏషియన్ చెస్ టోర్నీలో మెరిసిన దర్శినిని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది.

శ్రీకాంత్ పసిడి పరుగు

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ

శ్రీకాంత్

వరుణ్

శ్రీతేజ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఒడిశా వేదికగా జరుగుతున్న 39వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ అథ్లెట్లు నైని శ్రీకాంత్, అప్పాల వరుణ్, తోలెం శ్రీతేజ అదరగొట్టారు. మంగళవారం జరిగిన పెంటాథ్లాన్ ఈవెంట్‌లో శ్రీకాంత్ 3905 పాయింట్లతో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పుతూ పసిడి పతకం దక్కించుకోగా, వరుణ్ 3856 పాయింట్లతో రజతం కైవసం చేసుకున్నాడు. మరోవైపు హెప్టాథ్లాన్‌లో శ్రీతేజ 5087 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. మొత్తంగా ముగ్గురు అథ్లెట్లు జాతీయ స్థాయిలో సత్తాచాటి రాష్ట్ర ఖ్యాతిని పెంచారు.

మెరిసిన మమత

ముంబైపై హైదరాబాద్ విజయం • మహిళల సీనియర్ వన్డే టోర్నీ

అహ్మదాబాద్: మహిళల సీనియర్ వన్డే టోర్నీలో హైదరాబాద్ అదరగొట్టింది. మంగళవారం అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ 14 పరుగుల తేడాతో ముంబైపై విజయం సాధించింది. హైదరాబాద్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 48.2 ఓవర్లలో 229 పరుగులకు పరిమితమైంది. వృశాలి భగత్(82), కుషి(52 నాటౌట్)అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. యశశ్రీ (4/49), సాక్షిరావు(4/42) నాలుగేసి వికెట్లతో ముంబై పతనంలో కీలకమయ్యారు. అంతకుముందు నిర్ణీత 50 ఓవర్లలో హైదరాబాద్ 243/6 స్కోరు చేసింది. వికెట్‌కీపర్, బ్యాటర్ మమత(78 బంతుల్లో 86 నాటౌట్, 9ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కింది. సహచరులు అంతగా ఆకట్టుకోలేని చోట మమత సాధికారిక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది. ముంబై బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొడుతూ తన ఇన్నింగ్స్‌లో 9ఫోర్లు ఖాతాలో వేసుకుంది. జార్ధవి పవార్(2/43), నాయక్ (2/49) రెండేసి వికెట్లు తీశారు. మమతకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

గాడియం చాంప్స్ భవేశ్, చిన్మయ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గాడియ స్పోర్ట్స్‌ఫియా బ్యాడ్మింటన్ టోర్నీలో భవేశ్ రెడ్డి, చిన్మయ్ విజేతలుగా నిలిచారు. మంగళవారం ముగిసిన టోర్నీ డబుల్స్ ఫైనల్లో భవేశ్‌రెడ్డి, చిన్మయ్ జోడీ 21-15, 17-21, 21-13తో డెన్నిస్ రోనవీ, లియాన్స్ జెలా ద్వయంపై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. బాలుర సింగిల్స్ తుది పోరులో భవేశ్ 20-22, 12-21తో చిన్మయ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. బాలుర అండర్-11 విభాగంలో శ్రీరాం శహంత, బాలికల కేటగిరీలో మదలస సాయి విజేతలుగా నిలిచారు. టైటిల్ గెలిచిన ప్లేయర్లను ప్రియాంశు రజావత్, రామకృష్ణారెడ్డి పతకాలు అందజేశారు.

ప్రాక్టీస్..ప్రాక్టీస్

మూడో టెస్టు కోసం భారత్ సన్నాహం • అడిలైడ్‌లో చెమటోడుస్తున్న క్రికెటర్లు

అడిలైడ్: ఆస్ట్రేలియాతో మూడో టెస్టు కోసం భారత్ సన్నాహాలు మొదలుపెట్టింది. అడిలైడ్ డే అండ్ నైట్ టెస్టులో భారీ ఓటమి తర్వాత టీమ్‌ఇండియా సిరీస్‌లో మళ్లీ పుంజుకునేందుకు పట్టుదలతో కనిపిస్తున్నది. బ్రిస్బేన్ వేదికగా ఈనెల 14 నుంచి మొదలయ్యే మూడో టెస్టు కోసం అడిలైడ్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టింది. విరాట్‌కోహ్లీ, యశస్వి జైస్వాల్, కెప్టెన్ రోహిత్‌శర్మ, రిషబ్ పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయగా బౌలర్లు ఆకాశ్‌దీప్‌సింగ్, యశ్ దయాల్, హర్షిత్‌రానా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా ఫామ్‌లేమితో నానా ఇబ్బందులు పడుతున్న కెప్టెన్ రోహిత్ శర్మ ఎక్కువసేపు నెట్స్‌లో గడిపాడు. రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 పరుగులకే పరిమితమైన హిట్‌మ్యాన్ ఎలాగైనా గాడిలో పడాలన్న కసితో ఉన్నాడు. ఓవైపు పేసర్లతో పాటు స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటూ షాట్లు ఆడాడు. గత 12 ఇన్నింగ్స్‌ల్లో 142 పరుగులు మాత్రమే చేసిన రోహిత్ తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. పెర్త్ టెస్టులో సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ ఎడ్జింగ్ డెలీవరీలు ఎలా ఎదుర్కొవాలో ప్రాక్టీస్ చేశాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ ఎక్కువగా డిఫెన్స్‌కు ప్రాధాన్యమివ్వగా, వికెట్‌కీపర్ రిషబ్ పంత్ భారీ షాట్లు ఆడాడు. పెర్త్ టెస్టులో సూపర్ సెంచరీతో కదంతొక్కిన జైస్వాల్ ఎక్కువ సేపు ప్రాక్టీస్‌లో గడిపాడు. బౌలర్ల విషయానికొస్తే..ఆకాశ్‌దీప్ సింగ్, దయాల్, రానాతో పాటు స్పిన్నర్లు జడేజా, అశ్విన్, సుందర్ బౌలింగ్ సాధన చేశారు. వీరికి త్రోడౌన్ స్పెషలిస్టులు సహకారం అందజేశారు. బుమ్రా, సిరాజ్, నితీశ్ కుమార్ కొద్దిసేపే ప్రాక్టీస్‌కు పరిమితమయ్యారు. బుధవారం భారత జట్టు బ్రిస్బేన్‌కు బయల్దేరి వెళ్లనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ముందంజ వేసే సయయం ఆసన్నమైందంటూ క్రికెటర్ల ప్రాక్టీస్ సెషన్ వీడియోను బీసీసీఐ తమ అధికారిక ఎక్స్‌లో ట్వీట్ చేసింది.

నేడే టీవోఏ ఎన్నికల ఫలితాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్(టీవోఏ) ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడనున్నాయి. ఎల్ వెంకట్‌రాంరెడ్డి ఒలింపిక్ భవన్ వేదికగా టీవోఏ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. 2024-28 వరకు నాలుగేండ్ల పాటు కొనసాగనున్న టీవోఏ కార్యవర్గం కోసం గత నెల 21వ తేదిన ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే.

క్రికెటర్ టు పెయింటర్

చిత్రకారునిగా మారిన ఒలాంగా

హరారే: జింబాబ్వే మాజీ పేసర్ హెన్రీ ఒలాంగా పేరు గుర్తుండే ఉంటుంది. తన స్వింగ్ బౌలింగ్‌తో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ఇబ్బంది పెట్టిన ఒలాంగా ఇప్పుడు కొత్త కెరీర్ ఎంచుకున్నాడు. తాజాగా ముగిసిన అడిలైడ్ టెస్టులో ఒలాంగా పెయింటర్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. 2003లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఒలాంగా..రచయితగా, సామాజిక కార్యకర్తగా, అంపైర్‌గా, కోచ్‌గా పాత్రలు పోషించి ఇప్పుడు పెయింటర్‌గా తన ప్రతిభ నిరూపించుకుంటున్నాడు. అడిలైడ్ టెస్టు సందర్భంగా పెయింటింగ్ చేస్తు న్న ఒలాంగాను గుర్తించిన కొందరు అభిమానులు ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

పరువు పోరాటం

నేడు భారత్, ఆస్ట్రేలియా మహిళల మూడో వన్డే

పెర్త్: భారత మహిళల క్రికెట్ జట్టు పరువు నిలుపుకునేందుకు పోరాటానికి సిద్ధమైంది. ఇప్పటికే సిరీస్ సమర్పించుకున్న టీమ్‌ఇండియా బుధవారం ఆస్ట్రేలియాతో మూడో వన్డే ఆడనుంది. సొంతగడ్డపై దుమ్మురేపుతున్న ఆసీస్ చేతిలో క్లీన్‌స్వీప్ తప్పించుకునేందుకు భారత్ సర్వశక్తులు ఒడ్డాల్సిన సమయం వచ్చింది. స్టార్ బ్యాటర్లు స్మృతి మందన, హర్మన్‌ప్రీత్‌కౌర్ పేలవ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఆందోళన కల్గిస్తున్నది. హార్డ్ హిట్టర్ షెఫాలీవర్మను తప్పించడం జట్టుకు కలిసిరావడం లేదు. భారీ అంచనాలు పెట్టుకున్న వికెట్‌కీపర్ రీచా ఘోష్ ఒకే ఒక అర్ధసెంచరీతో ఊసురుమనిపించింది. మరోవైపు తహిలా మెక్‌గ్రాత్ సారథ్యంలో ఆసీస్ వరుస విజయాలతో దూసుకెళుతున్నది. ఆఖరిదైన మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసేందుకు తహతహలాడుతున్నది.

'బాక్సింగ్ డే'కు భలే గిరాకీ

మెల్‌బోర్న్: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈనెల 26 నుంచి మొదలయ్యే బాక్సింగ్ డే టెస్టు టిక్కెట్ల కోసం భలే గిరాకీ ఏర్పడింది. మెల్‌బోర్న్‌లో జరిగే ఈ నాలుగో టెస్టు తొలి రోజు ఆట టిక్కెట్లన్నీ హాట్‌హాట్‌గా అమ్ముడుపోయినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మ్యాచ్‌కు వేదికైన మెల్‌బోర్న్ స్టేడియం సామర్థ్యం లక్ష. మ్యాచ్‌కు మరో రెండు వారాల సమయమున్నా టిక్కెటన్నీ అమ్ముడుపోవడం భారత్-ఆసీస్ మ్యాచ్‌కు ఉన్న ఆదరణకు ఉదహరణగా నిలుస్తున్నది. తాజాగా ముగిసిన అడిలైడ్ టెస్టులో మూడు రోజుల్లో మ్యాచ్ వీక్షించిన అభిమానులు లక్షా 35వేల మందిగా రికార్డయ్యారు. ఓవరాల్‌గా గతంతో పోల్చిచూస్తే ఇది కొత్త రికార్డు కావడం విశేషం.

మార్చిలో సెట్స్‌మీదకు?

దేశవ్యాప్తంగా 'పుష్ప-2' అఖండ విజయంతో దూసుకుపోతున్నది. అన్ని భాషల్లో పుష్పరాజ్ హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్న తదుపరి సినిమాపై అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. ఈ సినిమా అప్‌డేట్స్ గురించి ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక కథాంశం గురించి అనేక కథనాలు ప్రచారమవుతున్నాయి. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమా కోసం పీరియాడిక్ కథాంశాన్ని ఎంచుకున్నారని, పాన్ ఇండియాకు రీచ్ అయ్యేలా స్క్రిప్ట్‌కు మెరుగులు దిద్దుతున్నారని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం మార్చిలో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. 'పుష్ప-2' రికార్డు స్థాయి వసూళ్లు, అన్ని భాషల్లో లభిస్తున్న ఆదరణ దృష్ట్యా తన సినిమాకు సంబంధించిన నటీనటుల ఎంపికపై త్రివిక్రమ్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెబుతున్నారు. బాలీవుడ్‌తో పాటు వివిధ భాషలకు చెందిన అగ్ర నటులను సినిమాలో భాగం చేయబోతున్నారని సమాచారం. జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురములో చిత్రాల తర్వాత త్రివిక్రమ్-బన్నీ కలయికలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై యస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

విక్రమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్

తమిళ అగ్ర హీరో విక్రమ్ నటిస్తున్న తాజా చిత్రం 'వీర ధీర శూరన్'. రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్ ఆర్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా రెండో భాగం 'వీర ధీర శూరన్-2' టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. విక్రమ్ పాత్రలోని రెండు భిన్న పార్శ్వాల్ని ఆవిష్కరిస్తూ టీజర్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. విక్రమ్ నటన, యాక్షన్ సీక్వెన్స్‌లు హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించాడు. పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, వినూత్న కథాంశంతో ఆకట్టుకుంటుందని, దీనికి ప్రీక్వెల్‌గా మొదటి భాగం ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాత: రియా శిబు, దర్శకత్వం: అరుణ్ కుమార్.

చిత్రం

'అందచందాల ఆవిష్కరణకే పెద్ద పీట వేసే ఈ గ్లామర్ ఫీల్డ్‌లో అభినయానికి ఆస్కారమున్న పాత్రలు దొరకడం అరుదు. ఎప్పుడో సడెన్‌గా అలాంటి పాత్రలు తలుపు తడతాయి. అలాంటి పాత్రనే 'సూర్య44'(వర్కింగ్ టైటిల్)లో చేశాను. ఇప్పటివరకు నా కెరీర్లో ది బెస్ట్ కేరక్టర్ ఇదే అని ఘంటాపథంగా చెప్పగలను' అంటున్నది అందాల భామ పూజా హెగ్డే. ప్రస్తుతం ఈ బుట్టబొమ్మ.. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినిమాలు కూడా చేస్తూ బిజీబిజీగా ఉన్నది. తాను చేస్తున్న సినిమాల్లో 'సూర్య 44' ఒకటి. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలోని తన పాత్ర గురించి ఇటీవల చెన్నైలో మాట్లాడింది పూజా హెగ్డే. 'ప్రేమ, యుద్ధం, నవ్వు.. ఈ మూడింటి చుట్టూ తిరిగే కథ ఇది. ఇప్పటివరకూ ఇలాంటి కాన్సెప్ట్ రాలేదు. ఈ కథకు నా పాత్ర వెన్నెముక. సూర్య లాంటి సూపర్‌స్టార్ నటిస్తున్న చిత్రంలో ఇంత ప్రాధాన్యత ఉన్న పాత్ర దక్కడం నిజంగా అదృష్టమే. షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్నది. అందరితోపాటు నేనూ ఈ సినిమాకోసం ఎదురు చూస్తున్నాను' అని తెలిపింది పూజా హెగ్డే. ఈ సినిమాతోపాటు బాలీవుడ్‌లో 'దేవా' అనే సినిమా, అలాగే వరుణ్‌ధావన్ జోడీగా మరో సినిమా చేస్తూ బిజీగా ఉన్నది పూజా హెగ్డే.

నా కెరీర్‌లో బెస్ట్ రోల్ ఇదే

యువ దర్శకుడితో సినిమా

ఇటీవలే 'విశ్వం' సినిమాతో పలకరించారు హీరో గోపీచంద్. తన తదుపరి సినిమా ఏంటి? అనేదానిపై మాత్రం ఇప్పటివరకూ క్లారిటీ లేదు. అయితే.. తాజాగా వినిపిస్తున్న వార్త ఏంటంటే.. 'ఘాజీ'ఫేం సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఆయన ఓ చిత్రం చేయనున్నారట. ఇటీవలే గోపీచంద్‌కి సంకల్పరెడ్డి ఓ కథ వినిపించారట. అది నచ్చడంతో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారట గోపీచంద్. చిట్టూరి శ్రీనివాస్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు తెలుస్తున్నది. గోపీచంద్ కెరీర్‌లోనే ఇది విభిన్నమైన కథ అని వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన అతి త్వరలోనే రానున్నట్టు సమాచారం.

రామ్‌చరణ్ కోసం..

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకుంటున్న విషయం తెలిసిందే. ఇటీవలే మైసూర్‌లో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. రామ్‌చరణ్ కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన వార్త బలంగా వినిపిస్తున్నది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్‌ని ఈ సినిమాలోని ఓ సన్నివేశంలో నటింపజేసేందుకు దర్శకుడు బుచ్చిబాబు ప్రయత్నిస్తున్నారట. కథ, సన్నివేశం బలంగా డిమాండ్ చేయడంవల్లే సల్మాన్‌ని కలవాలనుకుంటున్నారట బుచ్చిబాబు. సల్మాన్, చరణ్‌లకు మంచి అనుబంధం ఉంది. ఆ ఫ్రెండ్‌షిప్‌తోనే ఆయన చిరంజీవి 'గాడ్‌ఫాదర్'లో నటించారు. అలాగే ఈ సినిమాలో కూడా ఆయన తప్పక నటిస్తారని చిత్రబృందం నమ్మకంతో ఉందని తెలుస్తున్నది. ఈ సంక్రాంతిలోగా అధికారిక ప్రకటన రావొచ్చని వినికిడి.

ప్రతీకార నేపథ్యంలో 'పని'

మలయాళ నటుడు, దర్శకుడు జోజు జార్జ్ స్వీయ దర్శకత్వంలో మలయాళంలో రూపొందిన 'పని' చిత్రం అదే పేరుతో తెలుగులో ఈ నెల 13న విడుదల కానుంది. అభినయ కీలక పాత్రధారి. ఆమ్ వర్డ్ ఎంటర్టైన్మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నది. ప్రీరిలీజ్ ఈవెంట్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. జోజు జార్జ్ మాట్లాడుతూ ''పని' కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్. అందరూ మనసుపెట్టి చేసిన సినిమా ఇది. కచ్చితంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుంది' అని నమ్మకం వెలిబుచ్చారు. దంపతులు తమకు జరిగిన అన్యాయంపై ఎలా ప్రతీకారం తీర్చుకున్నారనే కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కించారు.ఈ చిత్రానికి కెమెరా: వేణు ఐఎస్‌సీ, జినోజార్జ్, సంగీతం: సామ్ సీఎస్.

నా పేరు శకుంతల

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్‌ని పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నెపూస రమణారెడ్డి నిర్మాత. క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ఈ సినిమా నుంచి 'శకుంతల క్కయ్యా..' అనే పార్టీసాంగ్‌ను విడుదల చేశారు. సునీల్‌కశ్యప్ మ్యూజిక్ అందించిన ఈ పాట హుషారైన బీట్స్‌తో సాగింది. కాసర్ల శ్యామ్ సాహిత్యాన్నందించిన ఈ పాటను ఊహా నేహా ఆలపించారు. స్నేహ గుప్తా డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాలో శ్రీకాకుళం డిటెక్టివ్ షెర్లాక్‌హోమ్స్‌గా వెన్నెల కిషోర్ కనిపిస్తాడని, ఓ కేసును ఛేదించే క్రమంలో ఆయనకు ఎదురైన సంఘటనలేమిటన్నదే కథాంశమని, చక్కటి హాస్యంతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్, స్నేహ గుప్తా తదితరులు చిత్ర తారాగణం.

హృద్యమైన ప్రేమకథ 'ప్రణయ గోదారి'

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విష్ణుష్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మాత రాజ్ కందుకూరి, సోహెల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు విష్ణుష్ మాట్లాడుతూ 'ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఈ సినిమా తీశా. అందమైన గోదారి నేపథ్యంలో హృద్యమైన ప్రేమకథగా ఆకట్టుకుంటుంది. పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ఈ టైటిల్ తనకు ఎంతగానో నచ్చిందని, మార్కండేయ సంగీతం బాగుందని నిర్మాత రాజ్ కందుకూరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.